# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి

5 | నిజామాబాద్, ఆదివారం 13 ఏప్రిల్ 2025 | KAMAREDDY




ఇందూర్ నగరంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న భక్తులు

## శోభాయమానం..


### వైభవంగా వీరహనుమాన్ విజయయాత్ర



**జై శ్రీరాం..జైజై శ్రీరాం** నినాదాలతో ఇందూరు మార్మోగింది. నగరం కాషాయవర్ణమైంది. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వీరహనుమాన్ విజయయాత్ర నిర్వహించారు. కంఠేశ్వర్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర జిల్లా పరిషత్, నాందేవ్‌వాడ, శివాజీచౌక్, దేవీరోడ్, గాంధీచౌక్, పెద్ద బజార్ మీదుగా ఆర్‌ఆర్ చౌరస్తా వరకు కొనసాగగా.. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

–సుభాష్‌నగర్, ఏప్రిల్ 12

# రైతుకు మళ్లీ రిక్తహస్తమే



### ప్రకటనలకే సర్కారు పరిమితం

- మార్చి 31లోపు రైతు భరోసా ఇస్తామన్న ప్రభుత్వం
- గడువు దాటినా పడని పెట్టుబడి సాయం
- యాసంగి ముగుస్తున్నా చలనం కరువు
- కొత్త పట్టాదారులకూ అందని రైతుభరోసా
- కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నదాతల ఆగ్రహం

**కాంగ్రెస్ ప్రభుత్వం** ప్రకటనలకే పరిమితమైంది. పథకాల అమలులో చిత్తశుద్ధి లోపించింది. రైతుభరోసా విషయంలో అది మరోసారి ప్రస్ఫుటమైంది. ఎప్పుడో నాట్ల సమయంలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం.. ఇప్పుడు పంట కోతలు కొనసాగుతున్నప్పటికీ ఇవ్వకుండా రైతులకు రిక్త'హస్తమే' చూపింది. డిసెంబర్ చివరి నాటికి వేస్తామని, సంక్రాంతికి ఇస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పింది. చివరకు మార్చి 31లోపు రైతులందరికీ రైతుభరోసా ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులంతా ఘనంగా ప్రకటనలు చేశారు. తీరా మార్చి 31 పోయి పన్నెండు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. ఉమ్మడి జిల్లాలో ఇంకా 2 లక్షల మందికి పైగా రైతుభరోసా జమ కాలేదు. పూటకో మాట చెబుతూ రైతుభరోసా ఎగ్గొడుతున్న వైనంపై రైతాంగం భగ్గుమంటున్నది.

–నిజామాబాద్, ఏప్రిల్ 12
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**కాంగ్రెస్** అధికారంలోకి వచ్చాక రైతుబంధు పథకానికి నీళ్లొదిలారు. గత వానకాలంలో పెట్టుబడి సాయం ఇవ్వకుండా ఎగ్గొట్టారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. దాన్ని రూ.12 వేలకు తగ్గించింది. పోనీ అదన్న సక్కగా ఇస్తారా అనుకుంటే అదీ జరుగలేదు. వానకాలంలో ఎగ్గొట్టినప్పటికీ యాసంగిలోనైనా రైతుభరోసా ఇస్తారని ఎదురుచూసిన రైతాంగానికి నిరాశే మిగిలింది. గడువు మీద గడువు చెప్పుకుంటూ ప్రభుత్వం పంట కోతల సమయం దాకా లాక్కొచ్చింది. నాట్ల సమయంలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం నేడు, రేపు అంటూ కాలం వెళ్లదీశారు. ఆ తర్వాత మార్చి 31కి గడువు పొడిగించారు. మొన్నటి గణతంత్ర దినోత్సవం (జనవరి 26) రోజున సీఎం రేవంత్‌రెడ్డి రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. మార్చి 31 లోపు ఆయా పథకాలను పూర్తి చేస్తామని ఘనంగా ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల్లోనూ ఇదే చెప్పారు. కానీ గడువు దాటిపోయింది. అయినా సాయం అందలేదు. గడువు మీద గడువు పొడిగించినప్పటికీ ఇంకా రైతు భరోసా పథకం పూర్తిగా అమలు కాలేదు.

### రైతులకు భరోసా లేని సాయం..

కేసీఆర్ హయాంలో విత్తనాలు వేసే సమయంలోనే రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. విత్తనాలు, ఎరువులు, కూలీలు ఇతర అవసరాలకు ఆ డబ్బులు ఉపయోగపడేవి. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం పంపిణీ ప్రహసనంగా మారింది. రైతు భరోసా పథకం ఉద్దేశాన్ని రేవంత్ ప్రభుత్వం పూర్తిగా మార్చేసింది. నాట్లు వేసే సమయంలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయాన్ని పంటలు కోసి, కాంటాలు వేస్తున్నా ఇవ్వలేని దుస్థితి నెలకొంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పంట కోతలు ఊపందుకున్నాయి. కొనుగోళ్లు కూడా ప్రారంభమయ్యాయి. కొంత మంది రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం రాగా, ఇంకా రెండు లక్షల మందికి పైగా అందలేదు. ఈ పరిస్థితిలో రైతుభరోసా ఇస్తారా.. ఎగ్గొడుతారా? అన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

### కొత్త పట్టాదారుల పరేషాన్..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొత్త పట్టాదారుల్లో ఏ ఒక్కరికి కూడా రైతుభరోసా రాలేదు. 2024 జనవరి 1 నాటికి పట్టా పాస్‌బుక్కులు ఉన్న వారందరికీ ఎకరాకు రూ.12వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గత జనవరిలో దరఖాస్తులను స్వీకరించింది. ధరణి డేటా ఆధారంగా బ్యాంక్ అకౌంట్ వివరాలను ఏఈవోలు అప్‌డేట్ చేశారు. కానీ ఇంత వరకూ రూపాయి సాయం కూడా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. పాత పట్టాదారులకు అరకొరగా పెట్టుబడి సాయం వచ్చినప్పటికీ, కొత్త పట్టాదారుల్లో ఏ ఒక్కరికీ సాయం అందలేదు. రైతుభరోసా పంపిణీ ప్రారంభించి రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు రైతు భరోసా జమ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నది. కానీ అందులోనూ అర్హులైన ఎంతో మంది రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. ప్రతి గ్రామంలో 50 శాతం లోపే రైతు భరోసా అందింది. మిగతా రైతులు ఏవో, ఏఈవోల వద్దకు వెళ్లి ప్రశ్నిస్తుండగా, ఏం సమాధానం చెప్పాలో తెలియక వారు సతమతమవుతున్నారు.

### కేసీఆర్ ఉన్నప్పుడే మంచి గుండె..



కేసీఆర్ సారు ఉన్నప్పుడు మంచిగుండె. నాట్లు ఏసే టైంలనే రైతుబంధు పైసలు ఖాతాల పడుతుండె. ఆ పైసల్తోని ఎరువులకు, కూలీలకు, అట్లనే ట్రాక్టర్ ఖర్సు ఎల్లిపోతుండె. గీ కాంగ్రెస్ సర్కారు కూడా అట్లనే డబ్బులు ఇస్తదని ఆశ పడితిమి. కానీ వాళ్లొచ్చినంకా ఏం ఫాయిదా లేదు. నాట్లు ఏసేటప్పుడు రావాల్సిన పైసలు రాకపా యే. అప్పు తెచ్చి పంట ఏసిన. ఇప్పుడు పంట కూడా కోస్తిమి. అయినా సర్కారు పైసలు రాలే. గిదేందని రోజూ బ్యాంకు సుట్టు, అధికారుల సుట్టు తిరుగుతున్న. వోళ్లు కూడా జవాబు చెప్తలేరు. మంచిజేసే కేసీఆర్‌ను ఒదిలి ప్రజలు గీ రేవంత్‌రెడ్డిని ఎందుకు గెలిపిచ్చింగ్రో అర్థమైతలేదు.

**- జాదవ్ రాములు, రైతు, మేడ్‌పల్లి తండా, చందూర్**

### ఇస్తరో ఇయ్యరో?



భూమి కొనుక్కుని పట్టా చేపిచ్చుకున్న. రైతుభరోసాకు దరఖాస్తు కూడా పెట్టుకున్న. మొన్న కొందరికి డబ్బులు పడ్డాయని చెబితే నాకూ అత్తయని అనుకున్న. మూడు నెలలై పాయే. రూపాయి రాక పాయే. ఇదేందని వ్యవసాయ అధికారిని అడిగితే అస్తాయే అని చెబుతుండు. పైసలు అచ్చుడు నమ్మికతక్కనే. మల్లా పదిహేను దినాలైతే నారుమడులు షురూ జేస్తాం. మొన్నటి పంటకే సర్కారు డబ్బులు ఇయ్యలే. మల్ల పంటకే ఏమిస్తది?

**- పాల్య శ్రీనివాస్, రైతు, శంకోర, వర్ని**

### కొందరికిచ్చి మిగతోళ్లకు ఎగ్గొడ్తారా?



నాకు ఐదెకరాల పొలమున్నది. మునుపు నార్లు పోసే టైంలనే కేసీఆర్ పైసలు అత్తుండే. పంట ఏసే తందుకు అవి మత్తు సౌలత్ అయితుండే. గీ రేవంత్‌రెడ్డి అచ్చినంక రైతుబంధు పైసలు అత్తలేవు. కొందరికి అచ్చినయ్. కొందరికి రాలే. ఎందుకత్తలేదని అడిగితే పేర్లు తప్పులున్నయని చెబుతుండ్రు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు పేరు తప్పు, ఊరు తప్పు అని ఏం లేకుండే. ఈ కాంగ్రెసోళ్లు అచ్చినంకనే ఇవ్వన్ని సమస్యలు అచ్చినయ్. అరే కొందరికి పైసలు ఇచ్చి మిగతోళ్లకు ఇయ్యకపోవుడేందో అర్థమైతలేదు. రైతులు వోళ్లు అయినా రైతులే కదా. మరీ ఎందుకిట్ల జేసుడు?

**- రమావత్ కళాబాయి, రైతు, కారేగాం, చందూర్**

# పసుపు బోర్డు ఎక్కడుందో చెప్పాలి?

- అబద్ధాలకు అర్వింద్.. నిలువెత్తు అద్దం
- ఎంపీగా జిల్లా అభివృద్ధికి నయాపైసా తెచ్చారా?
- కాంగ్రెస్ పల్లకి మోస్తున్న బీజేపీ
- ఒక్క బీఆర్‌ఎస్ మాత్రమే తెలంగాణ ఇంటి పార్టీ
- బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



ఖలీల్‌వాడి, ఏప్రిల్ 12 : జిల్లాలో పసుపు బోర్డు ఎక్కడ ఉన్నదో ఎంపీ అర్వింద్ చెప్పాలని బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. నేమ్ ప్లేట్ నిజామాబాద్‌లో, పసుపు బోర్డు ఆఫీస్ ఢిల్లీలో ఉన్నదని ఎద్దేవా చేశారు. ఎంపీ అర్వింద్ పెద్ద రాబంధు అని ఒక ప్రకటనలో విమర్శించారు. అర్వింద్ జిల్లాకు పట్టిన శని అని, పెద్ద అవినీతి గని అని ధ్వజమెత్తారు. అబద్ధాలకు అరవింద్ నిలువెత్తు అద్దమని పేర్కొన్నారు. పదవుల కోసం రంగులు మార్చే ఊసరవెల్లితో సమానమని మండిపడ్డారు. ఎంపీగా జిల్లా అభివృద్ధికి నయాపైసా తెచ్చారా అని ప్రశ్నించారు. అర్వింద్ రైతు ద్రోహి అని ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో అర్వింద్ కుటుంబం ఎక్కడ ఉన్నదని నిలదీశారు. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి డబ్బులు దండుకుంటూ, సీమాంధ్రుల పంచన చేరి తెలంగాణ ద్రోహులుగా మిగిలిపోయిన చరిత్ర డీఎస్ కుటుంబానిదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి మౌత్ స్పీకర్‌గా మారిన అర్వింద్, పదేపదే కేసీఆర్ ఫాం హౌస్ గురించి మాట్లాడడం సిగ్గుటన్నారు.

**ప్రజావ్యతిరేక విధానాలపై నోరెత్తని బీజేపీ నేతలు**

రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఒక్క రోజైనా బీజేపీ నాయకులు పోరాడారా ? అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్‌ది ఉద్యమ కుటుంబమని, అర్వింద్‌ది అవినీతి ఫ్యామిలీ అని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, కవిత కాలిగోటికి సరిపోరని పేర్కొన్నారు. కేసీఆర్‌ను తెలంగాణ తెచ్చిన మనిషి అని కూడా చూడకుండా, ఆయన వయస్సుకు గౌరవం ఇవ్వకుండా బీజేపీ నేతలు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గల్లీ లీడర్ల కన్నా అధ్వాన్నంగా తప్పుడు కూతలు కూస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఎందుకు విషం కక్కుతున్నావని, తెలంగాణ తెచ్చినందుకా ? తెలంగాణకు అన్ని విధాల అభివృద్ధి చేసినందుకు కేసీఆర్‌ను తిడుతున్నావా అని ప్రశ్నించారు. ఆయన భాష ఇలాగే కొనసాగితే జిల్లా ప్రజలే అర్వింద్ నాలుకను చీరేస్తారని స్పష్టం చేశారు. బీజేపీ నేతలు తిట్లతో ప్రజల దృష్టిని మళ్లించలేరన్నారు.

**కాంగ్రెస్, బీజేపీ తెలంగాణకు వ్యతిరేకం**

హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో బీజేపీ ఎంపీ పాత్రపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పల్లకి మోస్తున్న బీజేపీ ఎంపీలు ఒక్కనాడైనా తెలంగాణ కోసం ఢిల్లీలో గళమెత్త లేదని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు రూపాయి ఇవ్వకుండా మొండి చేయి చూపినప్పుడు ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు వ్యతిరేకమని, ఆ పార్టీలకు తెలంగాణ సోయి లేదన్నారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణకు, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం కట్టుబడి ఉన్న ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమేనని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# 'ఒంటి చేతి'తో గెలిచాడు..

### కుస్తీ పోటీల్లో విజేతగా నిలిచిన మల్లయోధుడు గణేశ్





అభంగపట్నంలో ఒంటి చేతితో కుస్తీ పడుతున్న గణేశ్

నవీపేట/నందిపేట, ఏప్రిల్ 12: తనకు ఒక చెయ్యి లేకున్నా కుస్తీ పోటీల్లో పాల్గొని ప్రత్యర్థులను మట్టి కరిపించాడు. ఒక్క చేతితోనే బరిలోకి దిగి విజేతగా నిలిచాడు మహారాష్ట్రకు చెందిన గణేశ్ అనే మల్లయోధుడు. నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలూకాలోని కర్కెల్లి గ్రామానికి చెందిన గణేశ్.. 14 ఏండ్ల క్రితం ఓ రైతు వద్ద పశువుల కాపరిగా పని చేసేవాడు. ఓ రోజు గేదెలు పట్టాలు దాటుతుండగా,అదే సమయంలో రైలు వస్తుండడంతో వాటిని తప్పించే క్రమంలో పట్టాలపై గణేశ్ పడిపోగా కుడి చేతి నుజ్జునుజ్జు అయ్యింది. దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు కుడి చేతిని భుజం వరకు తీసేశారు. ఏ మాత్రం అధైర్యపడకుండా కూలీ పనులు చేస్తూ కుస్తీపై ఆసక్తి పెంచుకొని ఏడేండ్ల నుంచి పోటీల్లో పాల్గొంటున్నాడు. శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నవీపేట మండలం అభంగపట్నం, నందిపేట మండలం అయిలాపూర్ గ్రామాల్లో వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో మల్లయోధుడు గణేశ్ పాల్గొన్నాడు. అభంగపట్నంలో నిర్వహించిన కుస్తీ పోటీలో నాందేడ్‌కు చెందిన గంగాధర్ అనే మల్లయోధుడిని చిత్తుచేశాడు. దీంతో గ్రామ కమిటీ సభ్యులు గణేశ్‌కు రెండు తులాల వెండి కడియంతో పాటు రూ. 500 నగదును అందజేశారు. వీడీసీ అభినందించి రూ.వెయ్యి నగదు బహుమతి అందించింది. అయిలాపూర్‌లో ఇద్దరు ప్రత్యర్థులను మట్టికరిపించి, నగదు బహుమతి అందుకున్నాడు. ఒక చెయ్యిలేకున్నా కుస్తీ పోటీల్లో రాణించిన గణేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

### ప్రాక్టికల్ పరీక్షల బహిష్కరణ

**తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల స్పష్టీకరణ**

డిచ్‌పల్లి, ఏప్రిల్ 12 : టీయూ పరిధిలో ఈనెల 16 నుంచి నిర్వహించనున్న ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. శనివారం సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని నిరసన కార్యక్రమాలు చేపట్టినా, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపినా ఫలితం లేకపోయిందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంలో జాప్యం చేయడంతో కళాశాలల భవనాల అద్దె, అధ్యాపకులు, సిబ్బంది జీతభత్యాలు చెల్లించలేక యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు ప్రతినిధులు స్పష్టం చేశారు.

### ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 12: జిల్లాకేంద్రంలో ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని లతీఫ్ కాలనీకి చెందిన షేక్ ఆసిఫ్ అలీ కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ గేమ్ నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అర్సపల్లి బైపాస్ రోడ్డులోని పెట్రోల్ బంక్‌లో సదరు యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సౌత్ రూరల్ సీఐ సురేశ్ కుమార్, ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావ్ తెలిపారు. యువకుడిని విచారించగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని పలువురు యువకులను నమ్మించి ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ కోసం వసూలు చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. ఆసిఫ్ అలీపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

# చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి

- నీట మునిగి బావ, బావమరిది మృత్యువాత
- నందిపేట మండలం సిద్ధాపూర్ గ్రామ శివారులో ఘటన



చేపలు పట్టేందుకు వచ్చి మృత్యువాత పడింది ఈ కుంటలోనే..

నందిపేట్/ ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 12 : చేపల వేటకు వెళ్లి నీట మునిగి ఇద్దరు (బావ, బావమరిది) మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని సిద్ధాపూర్ గ్రామశివారులో చోటుచేసుకున్నది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన షేక్ షాదుల్లా (46) ఇంటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన అతడి బావమరిది మహ్మద్ రఫీక్(47) రంజాన్ పండుగ కోసం వచ్చాడు. ఇద్దరూ కలిసి సరదాగా చేపల వేట కోసం నందిపేట మండలంలోని సిద్ధాపూర్ గ్రామశివారులో అమ్దాపూర్ రోడ్డు పక్కన ఉన్న మునికుంటకు శుక్రవారం సాయంత్రం వెళ్లారు. ముందుగా మహ్మద్ రఫీక్ చేపలు పడుతుండగా కాలు జారి కుంటలో పడిపోగా.. అతడిని రక్షించేందుకు షేక్ షాదుల్లా ప్రయత్నించగా ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. ఇద్దరికీ అంతంత మాత్రమే ఈత రావడంతో మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు శనివారం ఉదయం అక్కడికి చేరుకొని మృతదేహాలను బయటికి తీయించారు. మృతుడు షేక్ షాదుల్లా కుమారుడు సులేమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.